# పోరుబాటకు సిద్ధమైన అంగన్‌వాడీలు

**ఈనెల 17, 18న కలెక్టర్ కార్యాలయం ఎదుట వంటావార్పు..**

**సమస్యలు పరిష్కరించకపోతే నిరవధిక సమ్మె చేయనున్నట్లు ప్రకటన**




రంగారెడ్డి, మార్చి 15 (నమస్తేతెలంగాణ) : రాష్ట్ర ప్రభుత్వం ఐసీడీఎస్ వ్యవస్థను నిర్వీర్యం చేయటం కోసం చేస్తున్న ప్రయత్నాలను ఉపసంహరించుకుని మొబైల్ అంగన్‌వాడీ సెంటర్స్ యోచనను వెంటనే విరమించుకోవాలని కోరుతూ...అంగన్‌వాడీలు పోరుబాటకు సిద్ధమవుతున్నారు. తమ సమస్యలపై పలుమార్లు ఆందోళన చేపట్టినప్పటికి ప్రభుత్వం పెడచెవిన పెడుతున్నదని, ఈ సమస్యను పరిష్కరించుకోవాలనే ఉదేశ్యంతో ఈనెల 17, 18 తేదీల్లో జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట వంటావార్పు కార్యక్రమం నిర్వహించటానికి సిద్ధమవుతున్నారు. అందుకోసం ఇప్పటికే జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం కూడా అందజేశారు. రాష్ట్రంలో ఐసీడీఎస్ ప్రారంభమై 50సంవత్సరాలు అవుతున్నదని, అనేక రకాలుగా నేటికి సేవలందిస్తుడగా, పీఎంశ్రీ పథకం పేరుతో మొబైల్ అంగన్‌వాడీ సెంటర్స్‌ను ఏర్పాటు చేయాలన్న ఆలోచనను వెంటనే ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. అలాగే, అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్స్, మినీ టీచర్స్‌సమస్యలను వెంటనే పరిష్కరించటం కోసం అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ప్రత్యేక నిధులు కేటాయించాలని వారు కోరుతున్నారు. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అంగన్‌వాడీ వ్యతిరేక విధానాలను అమలు చేస్తున్నదని అంగన్‌వాడీ కేంద్రాలను ప్రైవేటుపరం చేయటం కోసం ప్రయత్నాలు చేస్తున్నదని వాపోతున్నారు. టీచర్స్, హెల్పర్స్‌కు నష్టం కలిగించే విధంగా ఐసీడీఎస్‌ను ప్రైవేటీకరణ చేయాలని నిర్ణయాలు తీసుకుంటున్నదని వాపోతున్నారు. ఐసీడీఎస్ కేంద్రాలకు పోటీగా మూడు నుంచి ఆరు సంవత్సరాల పిల్లలతో పీఎంశ్రీ పథకం కింద ప్రీప్రైమరీ కేంద్రాల పేరుతో 28జిల్లాలో 56కేంద్రాలను ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిసింది. ఈ నిర్ణయం ఐసీడీఎస్‌లను నిర్వీర్యం చేసే చర్య అని అంగన్‌వాడీలు మండిపడుతున్నారు. ప్రభుత్వం ఐసీడీఎస్‌ను బలహీనపర్చి శాశ్వతంగా కేంద్రాలు మూతపడే చర్యలకు పాల్పడుతున్నదని, అంగన్‌వాడి టీచర్లు, హెల్పర్స్‌కు నష్టం కలిగించే ఈ నిర్ణయాలనువెంటనే ఉపసంహరించుకోవాలని కోరుతున్నారు.

రంగారెడ్డిజిల్లాలో 1600అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటిలో 111 టీచర్‌పోస్టులు 500ఆయాలు ఖాళీగా ఉన్నాయి. వీటిని భర్తీచేసే ఆలోచనపై కూడా ప్రభుత్వం దృష్టి సారించటంలేదు. అంగన్‌వాడీ కేంద్రాల మీద ఆధారపడి జిల్లావ్యాప్తంగా సుమారు 3500మందికి పైగా టీచర్లు, ఆయాలు పని చేస్తున్నారని, వీరందరి సమస్యలు ప్రభుత్వం పట్టించుకోకపోగా ఈ వ్యవస్థ నీరుగార్చి కేంద్రాల మూతకు కుట్రలు చేస్తుందని వాపోతున్నారు.

**వెంటనే పరిష్కరించాలి : పోచమోని కృష్ణ, సీఐటీయు నాయకులు..**



అంగన్‌వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి. ముఖ్యంగా గ్రామాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ ఆయాలు, టీచర్ల పోస్టులను వెంటనే భర్తీచేయాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఐసీడీఎస్ వ్యవస్థను నిర్వీర్యం చేసే ప్రయత్నాలు మానుకుని ఐసీడీఎస్ అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించేందుకు కృషిచేయాలి.

# గడువు ముగిసింది సీజ్ మిగిలింది

**చందానగర్ సర్కిల్‌లో ఆస్తి పన్ను బకాయిదారులపై కఠిన చర్యలు**

మియాపూర్, మార్చి 15: ఆస్తి పన్ను బకాయిదారులపై కఠిన చర్యలకు జీహెచ్ఎంసీ అధికారులు సిద్ధమవుతున్నారు. పన్ను బకాయిల చెల్లింపు కోసం ఇప్పటికే ఓ టీఎస్‌ను ప్రకటించిన నేపథ్యంలో బకాయిలన్నింటిని పూర్తిస్థాయిలో వసూలు చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రభుత్వం ఈ అవకాశం కల్పించినప్పటికీ బకాయిలను చెల్లించని వ్యాపార వాణిజ్య సముదాయాలకు తాళం వేసి.. సీచ్ చేసే ప్రక్రియను మరింత వేగవంతం చేయనున్నారు. శేరిలింగంపల్లి జోన్ పరిధిలోని చందానగర్ సర్కిల్లో 75 మంది పెద్ద మొత్తంలో ఆస్తి పన్ను బకాయి పడ్డారు .ఇప్పటికే వారికి నోటీసులను జారీ చేశారు. నోటీసు గడువు సైతం తాజాగా ముగిసింది.ప్రభుత్వం ఓ టీ ఎస్ ను కల్పించినప్పటికీ ఇంకా బకాయిదారుల్లో చలనం రాకపోతుండడంతో సీచ్ మంత్రాన్ని అమలు చేసేందుకు సిదమవుతున్నారు రూ.5 లక్షలకు పైగా ఆస్తిపన్ను బకాయిలు ఉన్నవారు చందానగర్ సర్కిల్ పరిధిలో సుమారు 75 వరకు ఉన్నట్లు అధికారులు తెలిపారు. పన్ను బకాయిలను చెల్లించాలని ఇప్పటికే వారికి నోటీసులను జారీ చేశారు. ప్రభుత్వం ఓ టీ ఎస్ సైతం ప్రకటించిందని వడ్డీ రాయితీని సద్వినియోగం చేసుకోవాలని నోటీసుల్లో స్పష్టం చేశారు. అయినప్పటికీ బకాయి దారులలో స్పందన రాకపోతుండడంతో, సోమవారం నుంచి సదరు వ్యాపార కేంద్రాలను సీజ్ చేయాలని నిర్ణయించారు .ఇప్పటికే ఈ తరహా పన్ను బకాయిదారుల జాబితాను సిద్ధం చేశారు. ఇప్పటికే మాదాపూర్ డివిజన్ పరిధిలో రూ. 24 లక్షలకు గాని వాణిజ్య భవనం పన్ను బకాయి ఉండడంతో నెల కిందట సదురు భవనానికి అధికారులు తాళం వేశారు .పన్నులు చెల్లించకపోవడంతో ఇప్పటివరకు తాళం కొనసాగుతోంది .ఓటీ ఎస్ ను ప్రకటించడంతో సదురు బకాయిదారు తన ఆస్తి పన్ను బకాయిని చెల్లించేందుకు సిద్ధమయ్యారు. ఇదే తరహాలో మొండి బకాయిదారుల వ్యాపార వాణిజ్య కేంద్రాలను సీజ్ చేయడం ద్వారా తగిన గుణపాఠం నేర్పేందుకు చందానగర్ సర్కిల్ పన్ను విభాగం అధికారులు రంగం సిద్ధం చేశారు. అవసరమైతే ఆస్తులను జప్తు చేసి తమ పన్ను బకాయిలను వసూలు చేసుకునేందుకు వెనకాడబోమని అధికారులు పేర్కొంటున్నారు.




చందానగర్ సర్కిల్ కార్యాలయం



వార్షికోత్సవంలో ముఖ్యఅతిథిని సన్మానిస్తున్న జేబీ విద్యా సంస్థల కార్యదర్శి జేవీ కృష్ణారావు, మెడికల్ కళాశాల డైరెక్టర్ దీపిక తదితరులు




విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు

## మణికొండలో ఆక్రమణల తొలగింపు..

సిటీబ్యూరో, మార్చి 15(నమస్తే తెలంగాణ): నిబంధనలకు విరుద్ధంగా మణికొండలో హైటెన్షన్ విద్యుత్ తీగల కింద ఉన్న స్థలంతో పాటు నాలాను ఆక్రమించి ఏర్పాటు చేసిన రేకుల ప్రహారీని శనివారం హైడ్రా తొలగించింది. హైటెన్షన్ వైర్ల కింద నిర్మాణాలు చేపట్టవద్దన్న నిబంధనలను అతిక్రమించడం..బుల్కాపూర్ నాలాను ఓ నిర్మాణ సంస్థ కబ్జా చేస్తున్నదంటూ స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రెండు రోజుల క్రితం హైడ్రా బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించింది. మణికొండ మర్రిచెట్టు వద్ద ఓ నిర్మాణ సంస్థ నాలాను కలిపేసుకుని హైటెన్షన్ వైర్ల కింద నిర్మాణాలు చేసినట్లు నిర్ధారణ కావడంతో రేకుల ప్రహారీని తొలగించింది.



మణికొండలో ఆక్రమణలను తొలగిస్తున్న హైడ్రా సిబ్బంది

# విద్యార్థులు దేశానికి సేవలు అందించాలి

**రాష్ట్ర వైద్య విద్య డైరెక్టర్ డాక్టర్ నరేంద్రకుమార్**

మొయినాబాద్, మార్చి15: దేశంలో పుట్టి ఉన్నత విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు దేశానికి సేవలు అందించి దేశం రుణం తీర్చుకోవాలని తెలంగాణ రాష్ట్ర వైద్య విద్య డైరెక్టర్ డాక్టర్ నరేంద్రకుమార్ అన్నారు. మొయినాబాద్ మున్సిపాలిటి పరిధిలోని ఎన్కేపల్లి రెవెన్యూలో గల జేబీ విద్యా సంస్థల వార్షికోత్సవం శనివారం రాత్రి జేబీ విద్యా సంస్థల కార్యదర్శి జేవీ కృష్ణారావు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర వైద్య విద్య డైరెక్టర్ డాక్టర్ నరేంద్రకుమార్ మాట్లాడుతూ దేశంలో పుట్టి పెరిగి ఉన్న విద్యను అభ్యసించి విదేశాల్లో స్థిరపడాలని అనుకోవడంలో తప్పు లేదని, దేశంలో ఉద్యోగం చేసుకుంటూ దేశానికి సేవలు అందించుకుంటూ ఉంటే దేశం ఆర్థికంగా బలపడటానికి అవకాశం ఉంటుందని చెప్పారు.ప్రపంచంలోని అన్ని దేశాల కంటే భారత దేశంలో యువత చాలా ఉందని, ప్రపంచంలోని ఇతర దేశాలు భారతదేశంలోని యువత సేవల కోసం ఎదురు చూస్తున్నాయని పేర్కొన్నారు. అనంతరం ఆంధ్ర, తెలంగాణ, కర్నాటక రాష్ట్రాల ఇంటలీజెన్స్ కమాండింగ్ అధికారి మేజర్ కొనాల్‌సింగ్ మాట్లాడుతూ తల్లిదండ్రులు మీపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారని, వారి కష్టాన్ని వృథా చేయకుండ కష్టపడి చదివి ఉన్నత జీవితాన్ని నిర్మించుకోవాలని అన్నారు. అనంతరం జేబీ విద్యా సంస్థల కార్యదర్శి జేవీ కృష్ణారావు మాట్లాడుతూ జేబీ విద్యా సంస్థల్లో విద్యను అభ్యసించిన విద్యార్థులు ప్రపంచంలోని వివిధదేశాల్లో స్థిరపడి ప్రపంచ వ్యాప్తంగా సేవలు అందిస్తున్నారని, విదేశాలకు వెళ్లినప్పుడు ఈ విద్యా సంస్థలో చదివిన వారు కలిసినప్పుడు చాలా సంతోషంగా ఉంటుందని అన్నారు. జేబీ విద్యా సంస్థ ప్రాంగనంలో వైద్య విద్య, ఇంజినీరింగ్ విద్య, ఫార్మసీ,లా, డెంటల్ మరియు ఆర్కిటెక్చర్ విభాగాల ద్వారా విద్యను అందిస్తున్నామని చెప్పారు. విద్యార్థులుకు మెరుగైన వసతులు, సౌకర్యాలు కల్పించడంతో పాటు నాణ్యమైన విద్యను అందించడం వలనే విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చి విదేశాల్లో స్థిరపడుతున్నారని తెలిపారు. వార్షికోత్సవంలో విద్యార్థులు చేసిన నృత్యాలు, డ్యాన్సలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో రాష్ట్ర యాంటీనార్కోటిక్స్ బ్యూరో ఐపీఎస్ అధికారి రూపేష్, భాస్కర మెడికల్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ బి.దీపిక, జోగిన్‌పల్లి సొసైటీ కార్యదర్శి జె.వంశీధర్‌రావు, కోశాధికారి జె. గాయత్రి, వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# నాన్ పెయిడ్ మద్యం బాటిళ్ల పట్టివేత

సిటీబ్యూరో, మార్చి 15 (నమస్తే తెలంగాణ): నిబంధనలకు విరుద్ధంగా నాన్‌డ్యూటీ పెయిడ్ మద్యం వినియోగిస్తున్నట్లు సమాచారం అందుకున్న రంగారెడ్డి జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు నగర శివారు ప్రాంతాల్లో రెండు చోట్ల దాడులు నిర్వహించి 15 నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ కిషన్ కథనం ప్రకారం.. చేవేళ్ల ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధి మేడిపల్లి, మొయినాబాద్‌లోని ఫాంహౌస్‌ల్లో పర్మిషన్ లేకుండా మద్యం వినియోగిస్తున్నారనే సమాచారం మేరకు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఢిల్లీ, హర్యానా, గోవా నుంచి తెచ్చిన ఏడు బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. ఈవెంట్‌కు అనుమతి తీసుకోకపోవడంతో ఫాంహౌస్‌పై కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.

**ఘట్‌కేసర్‌లో విక్రయిస్తుండగా..**

ఢిల్లీ నుంచి తెచ్చిన మద్యం బాటిళ్లను ఘట్‌కేసర్‌లో విక్రయిస్తుండగా సమాచారం అందుకున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు లక్ష్మిరెడ్డిని అరెస్టు చేశారు. నిందితుడి వద్ద నుంచి 8 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణ నిమిత్తం కేసును ఘట్‌కేసర్ ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు.

# వృద్ధులంటే చిన్నచూపా..?

**గాంధీలో ప్రారంభానికి నోచుకోలేని జెరియాట్రిక్ విభాగం**

సిటీబ్యూరో, మార్చి15,(నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం మాటల ప్రభుత్వమే తప్పా చేతల ప్రభుత్వం కాదన్న విషయం తెలంగాణ ప్రజలకు ఏడాది తిరిగేలోపే తెలిసిపోయింది. ఎంతసేపు ప్రతిపక్షాలను దుమ్మెత్తి పోయడమే పనిగా పెట్టుకున్న రేవంత్ సర్కారు అభివృద్ధి పనుల్లో మాత్రం వెనుకడుగు వేస్తుంది. మరీ ముఖ్యంగా కేసీఆర్ హయాంలో వెలసిల్లిన వైద్యరంగ అభివృద్ధిని కొనసాగించకుండా ప్రాణం తీసే పనిపెట్టుకుంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటినుంచి నేటి వరకు వైద్యరంగం కుదేలైపోయింది. గాంధీ ఆసుపత్రిలో గతేడాదిలో జెరియాట్రిక్ విభాగం ఏర్పాటుకు శ్రీకారం చుట్టగా అది నేటికీ కలగానే మిగిలింది. ప్రస్తుతం ప్రారంభానికి నోచుకోక దుమ్ముతో దర్శనమిస్తుంది.

**లక్ష్యం చేరేదెన్నడూ..?**

అత్యధిక రోగులు గాంధీకి చికిత్సకోసం వస్తున్న తరుణంలో వృద్ధులు చికిత్స చేయించుకునేందుకు నానావస్థలు పడాల్సిన పరిస్థితి నెలకొంటుంది. వైద్యం కోసం గాంధీ మెట్లెక్కే వృద్ధులకు నాణ్యమైన వైద్యం అందించాలనే లక్ష్యంతో పదకొండు నెలల క్రితం జెరియాట్రిక్ వార్డుకు శ్రీకారం చుట్టారు. గతంలో చిన్నపిల్లల వార్డులుగా సేవందించిన రెండు వార్డులను వృద్ధులకోసం జెరియాట్రిక్ వార్డుగా మార్చారు. అందులో భాగంగానే 40 పడకల సామర్థ్యంతో ఆ వార్డు రూపురేఖలను మార్చేశారు. ఇటీవల గాంధీలో పర్యటించిన వైద్యారోగ్యశాఖ మంత్రి సైతం జెరియాట్రిక్ వార్డు పురోగతి పై అడగకపోవడం గమనార్హం.




దుమ్ముతో దర్శనమిస్తున్న గాంధీలోని జెరియాట్రిక్ విభాగం

# దవాఖానల్లో లిఫ్టులు సేఫేనా?

**కరువైన నిర్వహణ.. రోగులకు అవస్థలు**

**సర్వసాధారణంగా మారిన సాంకేతిక సమస్యలు**

**ఆపరేటర్లు లేకపోవడంతో తలెత్తుతున్న ఇబ్బందులు**




సిటీబ్యూరో, 15 (నమస్తే తెలంగాణ)/బన్సీలాల్ పేట/చార్మినార్/ఖైరతాబాద్: గ్రేటర్ పరిధిలోని 7 ప్రభుత్వ దవాఖానలు, 5 వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయాలతో పాటు 839 ప్రైవేటు దవాఖానల్లో లిఫ్టులను వినియోగిస్తున్నారు. ముఖ్యంగా ఉస్మానియా, గాంధీ, నిమ్స్, నిలోఫర్, ఎంఎన్‌జే తదితర ప్రభుత్వ రంగ దవాఖానల్లో ప్రతి నిత్యం వేలాది మంది రోగులు వైద్య సేవల కోసం లిఫ్టులను ఆశ్రయిస్తుంటారు. వీరితో పాటు కార్పొరేట్, ప్రైవేటు రంగ దవాఖానల్లో సైతం వేల సంఖ్యలో రోగులు లిఫ్టులను వినియోగిస్తున్నారు. దవాఖానల్లో అనారోగ్యంతో వచ్చే రోగులు, వారి సహాయకులు, వైద్యసిబ్బంది లిఫ్టులను వినియోగిస్తారు. కొన్ని కార్పొరేట్ దవాఖానల్లో 18 అంతస్తుల వరకు వైద్యసేవలు అందుబాటులో ఉంచడంతో రోగులు ఆర్టీసీ బస్సుల మాదిరిగా లిఫ్టుల కోసం నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొందంటే దవాఖానల్లో లిఫ్టుల వినియోగానికి ఎంత డిమాండ్ ఉందో అర్థం చేసుకోవచ్చు. అయితే ఇంత అత్యవసరమైన ఈ లిఫ్టుల పర్యవేక్షణ, పరిపాలనపై భిన్న కథనాలు వినిపిస్తున్నాయి. కొన్ని ప్రభుత్వ, ప్రైవేటు దవాఖానల్లో లిఫ్టుల మెయింటనెన్స్ తూతూ మంత్రంగా ఉంటున్నాయి. తరచూ అవి మరమ్మతులకు గురికావడం, మధ్యలోనే ఆగిపోవడం, సాంకేతిక సమస్యలు తలెత్తడం వంటి ఘటనలు సర్వసాధారణంగా మారినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏదైనా ఘటన జరిగితే తప్ప విషయం బయటకు రాని పరిస్థితి నెలకొన్నదని రోగులు ఆరోపిస్తున్నారు.

**రోగుల భద్రత గాలికి..**

కొన్ని ప్రభుత్వ, ప్రైవేటు దవాఖానల్లో రోగుల కోసం, వైద్య సిబ్బంది కోసం వేర్వేరుగా లిఫ్టులను అందుబాటులో ఉంచారు. కొన్ని దవాఖానల్లో రోగుల భద్రతను గాలికొదిలేస్తున్నారు. అటు సరైన మెయింటనెన్స్ లేకపోవడమే కాకుండా లిఫ్టులో ఆపరేటర్లను నియమించడకపోవడంతో లిఫ్టులో సాంకేతిక సమస్యలు ఏర్పడినప్పుడు రోగులు ప్రమాదంలో చిక్కుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలోనే మూడురోజుల కిందట గాంధీ దవాఖానలో సాంకేతిక సమస్యల కారణంగా మధ్యలో నిలిచిపోయిన లిఫ్టులో ఒకేసారి దాదాపు 20మంది వరకు రోగులు, వారి సహాయకులు చిక్కుకున్నారు. ఆ సమయంలో లిఫ్టులో ఆపరేటర్ ఉండి ఉంటే రోగులకు ఇబ్బందులు తప్పేవి. కానీ ఆపరేటర్ లేకపోవడంతో దాదాపు 30నిమిషాల పాటు వారు తమ ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ గడిపారు. తీరా సమాచారం అందుకున్న సిబ్బంది వెంటనే వచ్చి వారిని క్షేమంగా బయటకు తీయడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. అదృష్టవశాత్తు పెద్ద ప్రమాదం తప్పినట్లైంది. ఇలాంటి ఘటనలు తరచూ ప్రభుత్వ రంగ దవాఖానల్లోనే కాకుండా ప్రైవేటు రంగ దవాఖానల్లో సైతం జరుగుతున్నా సంబంధిత అధికారులు గాని, యాజమాన్యాలు గాని పట్టించుకోవడం లేదని రోగులు ఆరోపిస్తున్నారు.

**గాంధీ దవాఖానలో..**

గాంధీ హాస్పిటల్ లో మొత్తం 12 లిఫ్టులు అందుబాటులో ఉన్నాయి. దవాఖానలోని ప్రధాన భవనంలో 9, మాతా శిశు సంరక్షణ కేంద్రం (ఎంసీహెచ్) భవనంలో మూడు లిఫ్టులు ప్రస్తుతం పని చేస్తున్నాయి. అయితే ప్రధాన భవనంలో ఉన్న వైద్య సిబ్బంది వినియోగించే లిఫ్టులలో మాత్రమే ఆరుగురు లిఫ్ట్ ఆపరేటర్లు పనిచేస్తున్నారు. మూడు షిఫ్టులలో వారు విధులు నిర్వహిస్తున్నారు. కానీ రోగులు వినియోగించే లిఫ్టులలో ఆపరేటర్లు లేకపోవడంతో భద్రత ప్రశ్నార్థకంగా మారింది. ఇదిలా ఉండగా లిఫ్టుల నిర్వహణ బాధ్యతను 'కాంప్రెహెన్సివ్ యాన్యువల్ మెయింటెనెన్స్' అనే ప్రైవేటు సంస్థ కాంటాక్ట్ పద్ధతిలో నిర్వహిస్తున్నట్లు గాంధీ అధికారులు తెలిపారు. ఎప్పుడు సమస్య వచ్చినా వెంటనే సిబ్బంది వచ్చి వాటికి మరమ్మతులు నిర్వహించి తిరిగి పనిచేసేలా చర్యలు తీసుకుంటారని అధికారులు తెలిపారు. కరెంటు సరఫరా ఆగిపోతే జనరేటర్ల సదుపాయం కూడా అందుబాటులో ఉన్నదని వారు అన్నారు.

**నిమ్స్‌లో..**

నిమ్స్ ప్రతినిత్యం వేలాది మంది రోగులు వైద్యసేవల నిమిత్తం ఆయా బ్లాక్‌లలో ఉన్న లిఫ్టులను వినియోగిస్తారు. దవాఖాన మొత్తంలో 22 లిఫ్టులు ఉన్నాయి. కానీ ఒక్క లిఫ్ట్ ఆపరేటర్ కూడా లేకపోవడం గమనార్హం. అసలే అనారోగ్యంతో వచ్చే రోగులు పెద్ద సంఖ్యలో లిఫ్టుల్లో చిక్కుకుంటే తమ పరిస్థితి ఏంటని రోగులు, వారి సహాయకులు ప్రశ్నిస్తున్నారు. ఔట్ పేషెంట్ బ్లాకులో 7లిఫ్టులు మిలీనియం బ్లాకులో ఏడు ఫ్లోర్లకు వెళ్లేందుకు వీలుగా నాలుగు లిఫ్టులు స్పెషాలిటీ బ్లాకులో ఆరు ఫ్లోర్లకు ఆరు లిఫ్టులు ఉన్నాయి. ఇక ఎమర్జెన్సీ భవనంలో ఐదు ఫ్లోర్లు ఉండగా, ఐదు లిఫ్టులు ఏర్పాటు చేశారు. నిమ్స్‌లో లిఫ్ట్ ఎక్కడం ఆర్టీసీ బస్సు ఎక్కడంతో సమానమంటూ రోగులు మండిపడుతున్నారు. ఓవర్ లోడ్ కారణంగా తరచూ అక్కడ లిఫ్టులు ఆగిపోతుంటాయని, వాటి గురించి పట్టించుకునే వారే లేరని రోగుల బంధువులు ఆరోపిస్తున్నారు. 22 లిఫ్టులు ఉన్న నిమ్స్‌లో కేవలం ఒక్క టెక్నీషియన్ మాత్రమే ఉండగా అతను కూడా అందుబాటులో ఉండరని రోగులు ఆరోపిస్తున్నారు. దీంతో నిమ్స్‌లో లిఫ్ట్ భద్రత ప్రశ్నార్థకంగా మారింది.

**పేట్లబుర్జ్ ప్రసూతి దవాఖానలో..**

గర్భిణిలు చికిత్స పొందే పేట్లబుర్జ్ ప్రసూతి దవాఖానలో లిఫ్టుల పరిస్థితి ఆగమ్యగోచరంగా ఉంది. సరైన నిర్వహణ లేక అవి ఎప్పుడు పనిచేస్తాయో, ఎప్పుడు మొరాయిస్తాయో తెలియదు. లిఫ్టులు పనిచేయకపోతే గర్భిణిలు ఉసూరుమంటూ మెట్ల మార్గమో లేక ర్యాంపు మార్గమో కాలినడకన పై అంతస్తులోని విభాగాలకు వెళ్లాల్సిందే. ఈ దవాఖానలో మూడు ప్రధాన లిఫ్టులు కొనసాగుతున్నాయి. ఇందులో ఎవరైనా చిక్కుకుపోయే ప్రమాదం కూడా ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది... శ్చ అవకాశం ఉంటుంది. కొన్ని సార్లు చైన్‌గేట్ డోర్లు ఉన్న లిఫ్టులు ఒక్కోసారి డోర్ తెరిచి ఉన్నా పైకి లేదా కిందకు వెళ్లిపోతాయి. ఆ సమయంలో ఎవరైన లిఫ్ట్‌లోకి ప్రవేశిస్తున్నా లేక ద్వారా మధ్యలో ఉన్నా అది పైకి లేదా కిందకు వెళ్లే క్రమంలో ప్రజలు ఇరుక్కుపోయే ప్రమాదం ఉంటుంది. కొన్నిసార్లు లిఫ్ట్‌కు ఉన్న తీగలు తెగి పడడంతో లిఫ్టులు పై అంతస్తుల నుంచి కింద పడటం, లేదా లిఫ్ట్ పైకి రాకుండానే డోర్‌లు ఓపెన్ కావడంతో చూడకుండా ఒక్కసారిగా లిఫ్ట్‌లోపలికి కాళ్లుపెట్టినప్పుడు అదుపుతప్పి కిందపడిపోవడం వంటి ఘటనలు జరుగుతాయి. ఇలాంటి ప్రమాదాలను నివారించేందుకు ప్రధానంగా నిర్వహణ సక్రమంగా ఉండాలి. నాణ్యమైన లిఫ్ట్‌లను వినియోగించాలి. దవాఖానలు, వ్యాపార సముదాయాలు వంటి ప్రాంతాల్లో కచ్చితంగా లిఫ్ట్ ఆపరేటర్ ఉండటం మంచిది.

# షుగర్ ఫ్రీ ఐస్‌క్రీములకు భలే క్రేజ్

**తాజా పండ్లు ఆరగించిన అనుభూతి**


**మార్కెట్లో వేలల్లో ఫ్లేవర్స్,**

**విభిన్న రకాల వెరైటీలు**

**వేడుక ఏదైనా ఐస్‌క్రీమ్ ఉండాల్సిందే**

**వేసవిలో ఐస్‌క్రీం పార్లర్స్‌కు**

**పెరిగిన డిమాండ్**



సిటీబ్యూరో, మార్చి 15 ( నమస్తే తెలంగాణ ): చిన్నపిల్లల నుంచి పెద్దల వరకు ఐస్‌క్రీమ్‌ను చూస్తే చాలు లొట్టలేసుకుంటారు. సీజన్ ఏదైనా హిమక్రీములను రుచిచూడటంలో వెనుకాడరు. వేడుక ఏదైనా ఐస్‌క్రీమ్‌లకే జై కొడుతారు. స్ట్రాబెరీ, వెనిల, మ్యాంగో, రెడ్‌వెల్వెట్, చాకో ఆల్మండ్, ఫ్రూట్ బనానా తదితర ఐస్‌క్రీమ్స్.. అందరి నోళ్లల్లో నీళ్లూరిస్తుంటాయి. పార్లర్‌లో అడుగుపెట్టడమే ఆలస్యం విభిన్న రకాల ఫ్లేవర్స్ ఎంతగానో ఆకర్షిస్తాయి. ముఖ్యంగా షుగర్ ఫ్రీ ఐస్‌క్రీములకు భలే డిమాండ్ పెరిగిందని నిర్వాహకులు చెబుతున్నారు.

**తాజా పండ్లు తిన్నామనే భావన:**

కొన్ని ఐస్‌క్రీమ్ పార్లర్లు.. నేచురల్ ఐస్‌క్రీములకు ప్రాధాన్యత ఇస్తున్నాయి. తాజా పండ్లు తిన్నామనే భావన కలిగేలా ఐస్‌క్రీమ్స్‌ను ఎంతో రుచిగాతయారు చేస్తున్నారు. కొకొనట్, వాటర్ మిలన్, మ్యాంగో, అంజీర్, కాజూకిస్మిస్, చీకో, రోస్టెడ్ ఆల్మండ్, పాపయా,పైనాపిల్, మస్క్‌మెలన్, కేసర్‌పిస్తా, మలాయి తదితర ఐస్‌క్రీములకు భలే గిరాకీ ఉంటుందని పార్లర్ నిర్వాహకులు చెబుతున్నారు. పాలు, ప్రోటీన్లు, సాలిడ్స్‌లను కొంత పర్సెంటీలతో మిక్స్ చేసి ఐస్‌క్రీములను తయారు చేస్తారని ఒక పార్లర్ మేనేజర్ రవికాంత్ తెలిపారు.

**వెరైటీలతో ఆకర్షణ**

పిల్లల కోసం క్యాండిలాండ్, మేజిక్‌పాప్, బబుల్‌గమ్ ఐస్‌క్రీములు, అమ్మాయిల కోసం చాక్లెట్ ఫ్లేవర్స్‌తో వారిని ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. అంతేకాదు డయాబెటిక్ పేషెంట్లు ఐస్‌క్రీమ్‌లు లాగించేలా షుగర్ ఫ్రీ ఐస్‌క్రీములను అందిస్తున్నారు. వెనిలీ, స్ట్రాబెరీ, కేసర్‌పిస్తా, చాక్లెట్, కెర్మెల్ కుల్ఫీలను షుగర్ పేషెంట్లు రుచిచూస్తూ ఆనందంలో తేలుతున్నారు. ఇక అమ్మాయిలు ఎక్కువగా చాక్లెట్ ఐస్‌క్రీములను ఇష్టపడుతున్నారని నిర్వాహకులు చెప్పారు. చాకో క్రీమ్, చాకో ఆల్మండ్, చాకోబైట్ తదితర ఐస్‌క్రీములను అమ్మాయిలు ఇష్టంగా తింటున్నారని తెలిపారు.

**నోరూరిస్తున్న సీజనల్ ఐస్‌క్రీములు:**

సీతాఫల్, మ్యాంగో, పీచ్ ఆప్రికట్, బ్లాక్ గ్రేప్స్, లిచీ, జాక్‌ఫ్రూట్, గావా, కలాజమున్ తదితర సీజనల్ ఐస్‌క్రీములు కస్టమర్లను ఎంతగానో ఆకర్షిస్తున్నాయి. ఒక్క ఐస్‌క్రీం తినాలని పార్లర్‌కు వచ్చిన వారు.. అక్కడ కనిపించే వెరైటీలు చూసి అదనంగా ఐస్‌క్రీములను లాగిస్తున్నారు. దీంతో బిల్లుకనీసం రూ.500లు దాటుతోంది. బర్త్‌డే, ఫ్రెండ్స్ ట్రీట్ పేర్లు ఏదైతేనేం... ఐస్‌క్రీములు ఆరగించడమే ప్రధానంగా కనిపిస్తోంది. అంతేకాదు మనకు నచ్చిన ఐస్‌క్రీంలో విభిన్న రకాల ఫ్లేవర్స్ కలుపుకొని... డ్రైఫ్రూట్స్ వేసుకుని ఆరగించే వీలు కూడా పార్లర్స్ కల్పించాయి.